ఆదమరిస్తే.. అంతే..!



పోర్ట్ క్వార్టర్స్ వాటర్ ట్యాంక్స్ వద్ద రక్షణ గోడ లేని గెడ్డ





తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ పక్కన రక్షణ గోడ కూలిన గెడ్డ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల పరిధిలో పలు ప్రాంతాల్లోని గెడ్డలు, డ్రైనేజీలపై నిర్మించిన కల్వర్టులు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. వాటి వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. నేరుగా గెడ్డలు, కాలువల్లోకి జారి పడాల్సిందే. కొన్ని చోట్ల శిథిలమై.. మరి కొన్ని చోట్ల నిర్వహణ లేక రక్షణ గోడలు పాడయ్యాయి. నెలలు గడుస్తున్నా.. వీటికి మరమ్మతులు చేపట్టకపోవడంతోపాటు వర్షా కాలం కావడంతో స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో..

ప్రమాదపు అంచున ప్రయాణం

- తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ పక్కన గల గెడ్డపై నిర్మించిన రక్షణ గోడ కూలిపోయి చాలా కాలమైంది. దీంతో ఇక్కడ ప్రమాదపు అంచుల్లో ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక్కడ ఏ మాత్రం ఆదమరిచినా సరాసరి 20 అడుగుల లోతున ఉన్న గెడ్డలో జారి పడాల్సిందే.
- తాటిచెట్లపాలెం బజార్ నుంచి 80 ఫీట్ రోడ్డుకు వెళ్లే మార్గంలోని గెడ్డపై మరో కల్వర్టు ఉంది. ఇక్కడ కూడా రక్షణ గోడ లేదు. ఒక వైపు పూర్తిగా మెకానిక్ షెడ్ యజమాని ఆక్రమణలో ఈ కల్వర్టు ఉంటే.. రెండో వైపు ఏ మాత్రం రక్షణ గోడ లేకపోవడంతో తాత్కాలికంగా రోడ్ మార్జిన్‌లకు ఉపయోగించే దిమ్మను ఏర్పాటు చేశారు.
- రైల్వే న్యూకాలనీ వినాయక గుడి సమీపంలోని గెడ్డపై నిర్మించిన కల్వర్టు(వంతెన) వద్ద కూడా రక్షణ గోడలు ఒకవైపు శిథిలావస్థకు చేరుకున్నాయి. రక్షణ గోడ అడుగు భాగాన భారీ రంధ్రాలు పడటంతో పొరపాటున కాలు జారినా, పడిపోయినా పైకి రాలేని పరిస్థితి. రాత్రి వేళల్లో ఏమాత్రం ఆదమరిచినా గెడ్డలో పడాల్సిందే.
- సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్, పోర్ట్ వాటర్ ట్యాంక్స్ ఎదురుగా కొండవాలు ప్రాంతాల నుంచి ప్రవహించే మురుగు, డ్రైనేజీ నీటి కోసం చాలా పెద్ద డ్రైనేజీని పోర్ట్ యాజమాన్యం వారు నిర్మించారు. ఆ సమయంలో రెండు వైపులా రక్షణ గోడలు కట్టారు. ఒకవైపు రక్షణ గోడ కూలిపోయి కొన్ని నెలలవుతున్నా.. పోర్టు గానీ, జీవీఎంసీ వారు గానీ పట్టించుకోవడం లేదు. ఈ కల్వర్టు మీదుగా నిత్యం వందలాది మంది సాధారణ ప్రజలతోపాటు పోర్టు ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. ఇక్కడ పక్కనే పోర్టు క్వార్టర్స్ ఉన్నాయి. ఈ డ్రైనేజీ, గెడ్డ సుమారు 30 అడుగుల లోతున ఉంటుంది. ఏ మాత్రం ఆదమరిచినా, ప్రమాదాలకు గురైనా ప్రాణాలు దక్కవు.

రక్షణ గోడలు నిర్మించాలి

ఈ వార్డుల్లోని పలు ప్రాంతాల్లో గెడ్డలు, డ్రైనేజీలు, కల్వర్టులకు రక్షణ గోడలు లేకపోవడం వల్ల రోడ్ల మీదున్న చెత్తాచెదారం కూడా వీటిలో కలిసిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ కల్వర్టుల వద్ద వెంటనే రక్షణ గోడలు నిర్మించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



రైల్వే న్యూకాలనీలో పెద్ద రంధ్రాలతో శిథిలమైన రక్షణ గోడ



80 ఫీట్ రోడ్డులో రక్షణ గోడలు లేని కల్వర్టు



రైల్వే న్యూకాలనీలో గెడ్డపై రక్షణ గోడ లేని కల్వర్టు

శ్రీవారి సేవా రజతోత్సవాలు నిర్వహించాలి

మురళీనగర్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి సేవా కార్యక్రమం 24 ఏళ్ల పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ ఏడాదిని శ్రీవారి సేవా సంవత్సరంగా ప్రకటించి రజతోత్సవాలను నిర్వహించాలని మురళీనగర్‌లోని ముళ్లపూడి ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. ముళ్లపూడి ట్రస్టు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి శ్రీవారి సేవలో సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. మొదట్లో సుమారు 400 మంది సేవకులతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమంలో నేడు 4,000 మంది వరకు సేవకులు పాల్గొని భక్తులకు సేవలందిస్తున్నారని చెప్పారు. టీటీడీ చరిత్రలో గుర్తుండిపోయేలా మూడు నెలల పాటు శ్రీవారి సేవా రజతోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు టీటీడీ పాలక మండలి, కార్యనిర్వహణాధికారి, ఇతర అధికారులకు వినతిపత్రం పంపించామని ముళ్లపూడి ట్రస్టు కార్యదర్శి ఎంకేవీవీ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అన్నంరెడ్డి వాణి మృతికి సంతాపం



అన్నంరెడ్డి వాణి(ఫైల్)

సీతంపేట: తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుదీర్ఘ కాలం పనిచేసిన అన్నంరెడ్డి వాణి శనివారం మధ్యాహ్నం రామచంద్రానగర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. వాణి మరణంపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ ఆర్చి లోపల గల ఆమె నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని పార్టీ కార్యాలయం తెలిపింది.

క్లుప్తంగా

వైభవుడి ఆలయ అభివృద్ధికి కృషి



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి వైభవుడి చిత్రపటం అందిస్తున్న ఈవో ప్రసాద్

మురళీనగర్: వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఆయన శనివారం కప్పరాడలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు పూర్ణ కుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. వైభవుడికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అర్చకులు మంత్రికి ఆశీర్వచనం అందించారు. ఆలయ తరపున కేంద్ర మంత్రిని ఘనంగా సత్కరించి వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైభవుడిని దర్శించుకోవడం మనసుకు ప్రశాంతంగా ఉందన్నారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'ఐడియా వైజ్' అప్లికేషన్ ఆవిష్కరణ



అప్లికేషన్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, సంస్థ ప్రతినిధులు

సీతంపేట: స్థానిక శంకరమఠం సమీపంలోని డీప్‌టెక్ స్టార్టప్ హ్యాబిట్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తన మొదటి కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారిత అప్లికేషన్ 'ఐడియా వైజ్'ను ఆవిష్కరించింది. సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ప్రధాన జనరల్ మేనేజర్ పాల్ విలియమ్, ఎస్‌టీపీఐ అదనపు డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాతా ముఖ్య అతిథులుగా అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో బాపూజీ, సీజీవో హేమంత్ కుమార్, సీవోవో డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ ఐడియా వైజ్ అప్లికేషన్ క్యాప్‌స్టోన్ జీపీటీ మోడల్ ద్వారా వివిధ సాంకేతిక రంగాలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ప్రభుత్వ విభాగాలకు సంబంధించి ఒక బిలియన్‌కు పైగా సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉందన్నారు.

పేదలకు సరకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ట్రస్టీ జగదీశ్వరరావు

సీతంపేట: కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ శబరి కుటీర్ బృందావనంలో శనివారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ జగదీశ్వరరావు చేతుల మీదుగా కలాసీలు, వాచ్‌మెన్లు, కూలీలు, నిరుపేదలు సుమారు 150 మందికి సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లుగా ట్రస్టు తరఫున లోక కల్యాణార్థం నూతనంగా నిర్మించిన పలు దేవాలయాల ప్రతిష్టకు విగ్రహాలను అందజేశామని తెలిపారు. ప్రతి ఏటా తన తండ్రి వర్ధంతి రోజున పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్టు సభ్యులు అప్పలరాజు, మురళీకృష్ణ, కృష్ణ కల్యాణి, యోజనరాణి, కృష్ణకుమారి, లక్ష్మీ సత్యవతి, కుశాల్, కుసుమేష్, పూర్ణ రామేశ్వరి, రోహిత్, చైతన్య కృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

డాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా తమ సంస్థను లేదా 93816 67986, 72079 53919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మరింత బలోపేతం దిశగా మహిళా విభాగం



ఉత్తర నియోజకవర్గ మహిళా విభాగం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మరింత బలోపేతం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉత్తర నియోజకవర్గ మహిళా విభాగం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కె.కె.రాజుతోపాటు విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ శాతం మహిళలకే కేటాయించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్ర మహిళలకు మోసపూరిత హామీలిచ్చారన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమం విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సంస్థాగతంగా బలోపేతం కావాలని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా అధికార ప్రతినిధి మంచ నాగ మల్లేశ్వరి, వార్డు మహిళా అధ్యక్షులు, నియోజక వర్గ మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు



తులసి, పూల మాలల అలంకరణలో వెంకన్న

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారిని, ఉత్సవ మూర్తిలను తులసి మాలలు, గులాబీలు, కనకాంబరాలు, విరజాజులతో చూడముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం భక్తులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ పఠించారు. అనంతరం విశేష హారతులిచ్చారు.

నేడు రాధాష్టమి..

భాద్రపద మాసం అష్టమి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు లలితా పీఠంలో రాధాష్టమి నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. రాధాకృష్ణులకు విశేష పూజ జరుగుతుందని, భక్తులు పాల్గొని తమ గోత్ర నామాలతో పూజలు జరిపించుకోవచ్చని చెప్పారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఆలయం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పించారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


విష్ణు గణపతిగా దుర్గాగణపతి



అలరిస్తున్న శ్రీకృష్ణ బృందావన నృత్య ప్రదర్శన



విష్ణు గణపతి అలంకరణలో దుర్గాగణపతి



నిరుత గణపతి అలంకారంలో విజయ గణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి నాలుగో రోజు శనివారం విష్ణు గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. చిన్నారులు వివిధ నృత్య రీతుల్లో డ్యాన్స్‌లు చేశారు. వీటిలో చిన్నారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ బృందావనం నృత్యం అందరికీ ఆకట్టుకుంది. ఆదివారం ఆదిత్య గణపతి అలంకారంలో దుర్గాగణపతి దర్శనమిస్తారని ఈవో రమాభాయి తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిరుత గణపతిగా విజయ గణపతి

శంకరమఠం రోడ్ మధురానగర్‌లో కొలువైన విజయ గణపతి ఆలయంలో స్వామివారు నాలుగో రోజు శనివారం నిరుత గణపతి అలంకారంలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకం, అర్చనలు చేశారు.

విజయ గణపతికి కలువ పూలతో అర్చన



విజయ గణపతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మురళీనగర్ వాసులు

మురళీనగర్: విద్యార్థులు అత్యంత ప్రీతిపాత్రంగా కొలిచే స్థానిక బాలభాను విద్యాలయంలోని విజయ గణపతికి శనివారం కలువ పూలతో అర్చన చేశారు. పరీక్షలు రాసే ముందు ఈ గణపతికి విద్యార్థులు పూజలు చేసి హాజరవుతారు. వినాయక చవితి సందర్భంగా విజయ గణపతికి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, అలంకరణ చేస్తున్నారు. శనివారం 108 కలువ పువ్వులతో పూజలు చేసి 108 కొబ్బరికాయలు సమర్పించారు. పాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో గణపతికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం ప్రసాద వితరణ జరిగింది. బాలభాను ప్రిన్సిపాల్ శుభశ్రీ ఆధ్వర్యంలో మురళీనగర్ సెక్టార్-8 కాలనీ వాసులు సిహెచ్.ప్రవీణ, ఉష, బాల, కాలనీవాసులు పాల్గొని విజయ గణపతిని కలువ పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గెడ్డల ఆధునికీకరణకు నిధులు ఇవ్వండి

51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ విజ్ఞప్తి



ఆధునికీకరించాల్సిన అప్పయ్యనగర్ గెడ్డ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని అనేక సమస్యలపై ఎన్నోసార్లు జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేసినట్లు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తెలిపారు. వాటిలో ప్రతి సమస్యపై క్లుప్తంగా వివరించానని, గెడ్డల ఆధునికీకరణపై ఎన్నోసార్లు నిధులు కేటాయించాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చానని చెప్పారు. వార్డులోని అప్పయ్యనగర్ గెడ్డకు సంబంధించి ఆక్రమణలు తొలగించాలని, ముఖ్యంగా గెడ్డను ఆనుకుని నాయుడు కల్చరల్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ కట్టడం వల్ల గెడ్డ విస్తీర్ణం తగ్గిపోయి ఇరుగ్గా మారిందన్నారు. ఈ గెడ్డ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గెడ్డకు సంబంధించి బాటం కాంక్రీట్, రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు మంజూరు చేయడంలో విఫలమైందన్నారు. గెడ్డలను అభివృద్ధి చేయడం ద్వారా వాటి ప్రవాహం మెరుగుపడుతుందని, తద్వారా ప్రజల ఇబ్బందులు తీరుతాయని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పేర్కొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు



సీతమ్మధార రైతుబజార్‌లో నిర్వహిస్తున్న అన్నదానం



లక్ష్మీనారాయణపురంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న పైడి రమణ

తాటిచెట్లపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం వాడవాడలా అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. సీతమ్మధార రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పంచరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు, రైతులకు అన్నదానం నిర్వహించారు. రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- 45వ వార్డు లక్ష్మీనారాయణపురం-2లో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. వార్డు పార్టీ నాయకులు హరి పట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గేష్, పైడి శ్రీను, కత్తుల ప్రభాకరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- 45వ వార్డు వరాహగిరి కాలనీ-2లో సుధా సర్కిల్ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. శివాలయ అర్చకుడు అంబటిపూడి సుధీర్‌శర్మ పూజలు నిర్వహించగా, కమిటీ సభ్యులు అప్పారావు, దివాకర్, వినాయక, కిషోర్, అశోక్, హరి తదితరులు పర్యవేక్షించారు. మండపం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వరసిద్ధి వినాయకుడికి చిన్నారుల దీపారాధన



గొల్ల కంచరపాలెంలో దీపారాధన చేస్తున్న చిన్నారులు, ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలో వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా రాధికా'స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అన్నప్రసాద వితరణ, బుధవారం నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఓం కారం, గణేషుడి ఆకారంలో సర్వమత సమ్మేళనంతో రంగులు వేసి దీపాలు వెలిగించి చిన్నారులు తమ దైవభక్తిని చాటారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందించారు. ట్రస్టు సభ్యులు జ్యోతేష్, జశ్వంత్, మాన్విత, తేజశ్రీ, ప్రధాన లక్ష్మి లావణ్య, నిఖిల, ఈష్మిత, సాద్విక్, నామాల లోహిత్, హర్షవర్ధన్ సాయి, ఎం.జశ్వంత్, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యకర సమాజం



మాట్లాడుతున్న హెచ్ఎం రాధాకుమారి

సీతంపేట: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం నేషనల్ స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు క్రీడలు అవసరమన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, విద్యార్థి దశలో ఆటలు శారీరక ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. మొబైల్ ఫోన్లకు అలవాటు పడి ఆరుబయట ఆటలు తగ్గిపోతున్నాయన్నారు. పిల్లలు వారికి ఇష్టమైన ఆటలపై ఆసక్తి చూపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు యు.ఎన్.రత్నం ఆధ్వర్యంలో నెల రోజులుగా విద్యార్థులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ సురభి ఆర్థిక సహకారం అందించింది. స్థానిక నాయకుడు ముక్కా కిషోర్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.సత్య శ్రీలక్ష్మిదేవి, కార్యదర్శి ఎ.ఎస్.ఎ.శ్రీహర్ష, డి.అరుణ సందీప్ పాల్గొన్నారు.